

వానాకాలంలోనూ నీటిగోస

ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ఏ కాలమైనా నీటి గోస తప్పట్లేదు. పక్షం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. 9లో

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024-25 విద్యా సంవత్సరానికి గాను మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనార్టీ విద్యార్థులకు సీఎం విద్యా పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి రాజలింగు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆగస్టు 8లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0/22.0

పలుచోట్ల ఉరుములు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రేషన్‌షాపుల తనిఖీ

- పీడీఎస్ బియ్యం అమ్మితే క్రిమినల్ కేసులు : డీఎస్‌వో



శాంతినగర్‌లోని రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న డీఎస్‌వో, అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కైలాస్‌నగర్: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందాపై 'రేషన్... పక్కదారి' శీర్షికన 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి డీఎస్‌వో టి.కిరణ్ కుమార్ గుప్తా స్పందించారు. జిల్లా కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. శాంతినగర్, తిర్పెల్లి, బ్రహ్మస్‌వాడ, గౌరమ్మబట్టి, ఖానాపూర్ కాలనీల్లోని ఎనిమిది షాపులను సందర్శించారు. బియ్యం పంపిణీ, నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయకుండా పక్కదారి పట్టించినట్లు తెలిస్తే లైసెన్స్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అలాగే పీడీఎస్ బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా నిత్యావసరాల చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్, యూడీఆర్‌ఐ బి.పుష్పమాల ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ఖైదీలను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఖైదీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా జైలులో ఖైదీలకు సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. రిమ్స్, వైద్యారోగ్య శాఖ వైద్యులు ఖైదీలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.శిబిరంలో 135 మంది ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. వివిధ సమస్యలతో బాధపడుతున్న ఎనిమిది మందిని రిమ్స్‌కు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో జైలు సూపరింటెండెంట్ అశోక్, రిమ్స్ వైద్యులు నవీన్, వివేక్, జన్నిఫర్, అష్రఫ్, సచిన్‌రెడ్డి, జైలు అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'వారిపై చర్యలు తీసుకోండి'



డీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేసిన మండల విద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు డీఈవో ప్రణీతకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. కొన్ని మండలాల్లో ఎంఈవోలు ఉపాధ్యాయులను నిబంధనలకు విరుద్ధంగా రిలీవ్ చేశారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. రిలీవ్ చేసిన వారిని వెంటనే వెనక్కి పిలిపించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో టీయూటీఎఫ్, ఎస్టీయూ, టీటీఎఫ్, టీఎస్‌పీటీఏ, పీఆర్టీయూ టీజీ సంఘాల నాయకులు శ్రీకాంత్, జాదవ్ అశోక్, నరేష్, రియాజ్, నూర్‌సింగ్, నవీన్ కుమార్ యాదవ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ ఉద్యోగుల సీనియారిటీ జాబితా విడుదల

కైలాస్‌నగర్: ఉద్యోగుల సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలలు, మండల, జెడ్పీ కార్యాలయాల్లో నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగుల సీనియారిటీ జాబితాను సోమవారం ప్రకటించారు. ఆఫీస్ సబార్డినేట్స్ 37 మంది, రికార్డు అసిస్టెంట్లు ఏడుగురు, జూనియర్ అసిస్టెంట్లు 16 మంది, టైపిస్టులు ఐదుగురు మొత్తం 65 మంది ఉద్యోగులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను ప్రకటించారు. వీరంతా బదిలీ కోసం ఈనెల 9నుంచి 11వరకు ఆప్షన్లు ఇచ్చుకోవాలని జెడ్పీ అధికారులు తెలిపారు.



మత్తడివాగు ప్రాజెక్టు

ఆయకట్టు స్థిరీకరణ



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

- 'మత్తడివాగు' నిర్మించిన 16 ఏళ్ల తర్వాత..
- తుది దశకు మరో కాలువ పనులు
- తక్కువ ఖర్చయ్యే ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో నిర్మాణం
- గ్రావిటీ ద్వారా ఎడుమ కాలువ నుంచి ఇప్పటికే సాగునీరు
- కుడివైపు మాత్రం పైపులైన్ ద్వారా..

సాక్షి,ఆదిలాబాద్: మత్తడివాగు నిర్మించిన 16ఏళ్ల తర్వాత ఆ ప్రాజెక్ట్ పూర్తి ఆయకట్టు స్థిరీకరణకు నోచుకుంటుంది. గ్రావిటీ పద్ధతిలో ఎడుమ కాలువ ద్వారా ఇప్పటికే సాగునీరు అందిస్తుండగా, కుడి కాలువ నిర్మాణంలో వివిధ ఆటంకాలతో ఇన్నేళ్ల సమయం తీసుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇది నిర్మాణానికి నోచుకుంది. కాగా తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో పూర్తయ్యే ప్రాజెక్టులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. వచ్చే సీజన్‌కల్లా వాటిని పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించింది. కాగా ఈ పనులు తుది దశకు వచ్చాయి. త్వరగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు జలవనరుల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

కాల్వల నిర్మాణానికి భూములు ఇవ్వకపోవడంతో..

తాంసి మండలం వడ్డాడి గ్రామం వద్ద ఈ మధ్యతరహా ప్రాజెక్టును 2008 సంవత్సరంలో నిర్మించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.62.4 కోట్లు వెచ్చించారు. 0.571 టీఎంసీ సామర్థ్యం గల ప్రాజెక్టును ఐదు గేట్లతో నిర్మించారు. ఎడమ కాలువ 8,500 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. తాంసి, ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని 14 గ్రామాల రైతులకు దీని ప్రయోజనం దక్కింది. అయితే కుడి కాలువ ద్వారా మరో 1200 ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ చేయాలని గతంలోనే నిర్ణయించినప్పటికీ కాలువల నిర్మాణం విషయంలో ప్రధానంగా భూసేకరణలో ఇబ్బంది ఎదురైంది. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేకపోవడంతో ఏళ్లు గడిచినా ముందడుగు పడలేదు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించారు. వివిధ రాష్ట్రాల్లో ఇలాంటి సందర్భాల్లో ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై పరిశీలించారు. వివిధ రాష్ట్రాల్లో పరిశీలన అనంతరం రాష్ట్రంలోనే తొలిసారిగా ఓ ప్రాజెక్ట్ ఆయకట్టు స్థిరీకరణ కోసం పైపులైన్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. 2017లో రూ.7 కోట్లతో ఈ పనులు ప్రారంభించారు.

పైపులైన్ ద్వారా ఆయకట్టుకు నీరు..

మైక్రో ఇరిగేషన్ స్కీమ్ ద్వారా ఈ ప్రాజెక్టుకు కుడివైపు కాలువ స్థానంలో అండర్ గ్రౌండ్‌లో పైపులైన్ వేశారు. తొమ్మిది కిలోమీటర్ల మేర ప్రధాన పైపులైన్ వేయగా, మరో 20 కిలోమీటర్లు అంతర్గత పైపులైన్ వేయడం ద్వారా ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు చేపట్టారు. తాంసి మండలం హస్నాపూర్, ఖోడద్, పొన్నారి, తరోడ గ్రామాల్లోని చేలకు నీళ్లందించేలా దీన్ని రూపొందించారు. ఇప్పటికే పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టు సమీపంలో నే పంప్‌హౌస్ నిర్మించారు. తద్వారా కుడివైపు పైపులైన్‌కు నీళ్లు ఎత్తిపోతల మాదిరిగా పనిచేయనుంది. ఎడమ కాలువ మాత్రం గ్రావిటీ ద్వారా ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీళ్లందుతాయి.



ప్రాజెక్ట్ వద్ద నిర్మించిన పంపుహౌస్

వచ్చే సీజన్ నుంచే ఆయకట్టుకు నీళ్లు



ఈ వర్షాకాలం అయిపోగానే ఆయకట్టుకు పైపులైన్ ద్వారా నీళ్లందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్‌కు చెందిన జైన్ ఇరిగేషన్ ఏజెన్సీ పైపులైన్ పనులు చేపట్టింది. ఇప్పటికే రూ.2 కోట్ల వరకు చెల్లింపులు కూడా జరిగాయి. ప్రభుత్వం మత్తడివాగు నిర్మాణంపై దృష్టి సారించినందున పనులు త్వరగా పూర్తవుతున్నాయి.

– హరీశ్‌కుమార్, ఏఈ, మత్తడివాగు ప్రాజెక్ట్

ప్రజల హృదయాల్లో వైఎస్సార్



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి
- ఘనంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలతో డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. దివంగత మహానేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ, ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల నిర్మాణంతో వైఎస్సార్ రైతు బాంధవుడిగా నిలిచారన్నారు. వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాయకులు గిమ్మ సంతోష్, ప్రవీణ్‌రెడ్డి, సాయిచరణ్, షకీల్, ముజ్జు, కృష్ణారెడ్డి,దేవిదాస్‌పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో..

వైఎస్సార్‌జయంతి వేడుకలను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో నిర్వహించారు.వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మపురి చంద్రశేఖర్, దామోదర్ రెడ్డి, నవీన్‌రెడ్డి, నాగరాజు, రంజిత్ రెడ్డి, నగేశ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు వివిధ వినూత్న ఆవిష్కరణలో తమ ప్రతిభ చాటేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహిస్తుందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేషన్‌పై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు, సమాజానికి ఉపయోగపడేలా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చేస్తున్న ప్రయోగాలను గుర్తించాలన్నారు. ఈమేరకు డీఈవో, డీఐఈవో, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని బయటకు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ఆగస్టు 3లోగా దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఎంపికైన వాటి ని జనవరి 26, ఆగస్టు 15 వేడుకల్లో ప్రదర్శించడంతో పాటు ప్రభుత్వ పరంగా ఆర్థిక ప్రోత్సాహం సైతం అందించనున్నట్లు తెలిపారు. అంతకముందు ఇన్నోవేషన్ జిల్లా కోఆర్డినేటర్ సాయికృష్ణ పలువురు విద్యార్థులు, రైతులు తయారు చేసిన పలు ప్రదర్శనలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు.

ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత

షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ద్వారా అమలవుతున్న సీడబ్ల్యూఎఫ్ పథకం కింద ఉట్నూర్ మండలం హస్నాపూర్‌కు చెందిన ఎస్‌ఐటీ విద్యార్థి గవెల ఆర్తీ, ఇంద్రవెల్లి మండలం ఏమాయి కుంట గ్రామానికి చెందిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి కొడి రాజ్‌కుమార్‌కు మంజూరైన ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ అందజేశారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునీత, డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్, బీసీ సంక్షేమాధికారి రాజలింగు, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

శిథిల భవనాలు కూల్చివేయాలి

మున్సిపల్ పరిధిలో శిథిల భవనాలు కూల్చివేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాలతో పాటు ప్రజా పాలన కేంద్రాన్ని సందర్శించారు. ఆయా విభాగాల ద్వారా ప్రజలకు అందుతున్నసేవలపై ఆరాతీశారు.కమిషనర్‌తో పాటు ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సెల్లార్లను గుర్తించి వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశించారు. వ్యాధుల సీజన్ కావడంతో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట కమిషనర్ ఖమర్ అహ్మద్, టీపీవో అనురాధ తదితరులున్నారు.

వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

- 'ప్రజావాణి'కి 166 అర్జీలు

కైలాస్‌నగర్: ప్రజావాణికి ఈ వారం వినతులు వెల్లువెత్తాయి. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారితో కలెక్టరేట్ సందడిగా మారింది. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు కలెక్టర్ రాజర్షి షా హాజరై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. భూ సమస్యలు, పింఛన్లు, వ్యవసాయ రుణాలు వంటి సమస్యలపై 166 అర్జీలు అందాయి. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కొందరి నివేదన వారి మాటల్లోనే..

సమస్య పరిష్కరించండి..



నిరుపేదలమైన మాకు 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మావల మండల పరిధిలోని సర్వేనంబర్ 170లో ఇంటి పట్టాలు అందజేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని మేము కట్టుకున్న నిర్మాణాలను కూల్చివేసింది. 2021లో నర్సింగ్ కళాశాలకు కేటాయిస్తున్నట్లుగా ప్రకటించింది. కానీ ఆ కళాశాలను వేరే చోట నిర్మిస్తున్నారు. సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– 170 సర్వే ప్లాట్‌దారులు, మావల

ఉద్యోగాలిచ్చి ఆదుకోండి..



వీఆర్‌ఏ వ్యవస్థ రద్దు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెగ్యులర్ పేస్కేల్ ప్రకటించి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. 61 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల స్థానాల్లో వారి కుటుంబీకులకు వారసత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు ఆ ప్రక్రియ చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించి వీఆర్‌ఏల వారసులమైన మాకు ఉద్యోగావకాశాలు కల్పించి ఆదుకోవాలి.

– వీఆర్‌ఏ వారసత్వ అభ్యర్థులు

'పీఎం కిసాన్' అందట్లేదు..

నిరుపేదలమైన మాకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితబస్తీ పథకం కింద మూడెకరాల చొప్పున 2017లో భూములు పంపిణీ చేసింది. ధరణి పట్టాలు అందించి మమ్మల్ని రైతులను చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలన్నీ అందుతున్నా కేంద్ర ప్రభుత్వం పీఎం సమ్మాన్ నిధి కింద అందించే రూ.2వేల సాయం మాత్రం రావడం లేదు. కేంద్ర సాయం అందేలా చూడాలి.

– మహిళా రైతులు, చాంద(టి)



బెల్టుషాపులు ఎత్తేయాలి



మా గ్రామంలో వాడవాడన బెల్టు షాపులున్నాయి. 15ఏళ్లు నిండని పిల్లలు కూడా మద్యానికి అలవాటు పడుతున్నారు. యువత, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. బెల్టుషాపులు తొలగించాలని ఎక్సైజ్, పోలీస్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి బెల్టుషాపులు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలి.

–మాంగ్రూడ్ మహిళలు, బేల

నిషాన్‌ఘాట్‌లో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలోని నిషాన్‌ఘాట్‌లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. నిరుపేదలతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలోని నిషాన్‌ఘాట్‌లో సుమారు 300 కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నాయన్నారు. కాలనీలో కనీస సౌకర్యాల కల్పన కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక ఉద్యమాలు, దీక్షలు చేపట్టినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి వారికి ఇంటి పట్టాల జారీతో పాటు తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో పార్టీ నాయకులు రాములు, అరుణ్‌కుమార్, నళినిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న కాలనీవాసులు, నాయకులు

జీవో 10 రద్దు చేయాలని ఆందోళన

- అంగన్‌వాడీల రిలే దీక్షలు

కైలాస్‌నగర్: తమకు అన్యాయం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 10 రద్దు చేయాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీలు ఆందోళన బాట పట్టారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు, ఆయాలకు నష్టం కలిగించే జీవో 10ని రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.1 లక్ష పెంచుతూ కొత్త జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, నాయకులు పంచపుల, పంచశీల, పెంటుబాయి, లక్ష్మి, అనిత, కమల తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న అంగన్‌వాడీలు, ఆయాలు

నేడు జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహేందర్ జీత్, స్విమ్మింగ్ కోచ్ కృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజువల్ ఈవెంట్లలో పోటీలు ఉంటాయని తెలిపారు. గ్రూప్ వన్ విభాగంలో 15, 16, 17 ఏళ్ల వారు, గ్రూప్- 2 విభాగంలో 12, 13, 14 ఏళ్ల వారు, గ్రూప్ త్రీ విభాగంలో 10, 11 సంవత్సరాల బాల బాలికలకు పోటీలు ఉంటాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

క్లుప్తంగా

భారత్ జోడో సదస్సుకు నిర్మల్ వాసి



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: మహారాష్ట్రలోని వార్ధాలో గల సేవాగ్రామ్ ఆశ్రమంలో నిర్వహిస్తున్న భారత్ జూడో అభియాన్ జాతీయ సదస్సులో నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటున్నారు. ఈ నెల 8, 9 వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయస్థాయి సమావేశానికి ప్రవాస మిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్లకు చోటు దక్కింది. దేశవ్యాప్తంగా ఉన్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, మేధావులు ఈ సదస్సులో పాల్గొంటుండగా కార్మిక సంక్షేమం పట్ల రాష్ట్రస్థాయిలో సేవలందిస్తున్న స్వదేశ్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. తెలంగాణ రాష్ట్రం నుండి స్వదేశ్‌తో పాటు సామాజిక కార్యకర్త కవిత కురుగంటి, తెలంగాణ కన్వీనర్ వీస్సా కిరణ్, రైతు స్వరాజ్య వేదిక అధ్యక్షుడు కన్నెగంటి రవి, తదితరులు ఇందులో పాల్గొంటున్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతికాలనీలో గల వేంకటేశ్వరాలయంలో ఆదివారం రాత్రి చోరీకి యత్నించిన దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. ముధోల్ మండలం ముద్గల్‌కు చెందిన నాగుల రాజు ఆలయంలో చోరీకి యత్నిస్తుండగా గమనించిన స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు దొంగను అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. రాజు గతంలో ముధోల్ మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి



మృతి చెందిన మేక

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీను మేక కుభీర్ చౌరస్తా ప్రాంతంలో సోమవారం మేత కోసం ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందింది. దీంతో రూ.15వేల వరకు నష్టపోయినట్లు రైతు తెలిపారు. వేలాడుతున్న విద్యుత్ తీగల విషయమై విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయాడు. నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.

కుక్కకాటుతో ముగ్గురికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామంలో కుక్కకాటుతో ముగ్గురికి గాయాలయ్యాయి. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన సాగర, ముత్యం, నర్సయ్యలను కుక్క కాటు వేయడంతో అక్కడున్నవారు అప్రమత్తమై వాటిని తరిమేశారు. గాయాలపాలైన ముగ్గురిని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..



నాడు చెరువు నీరు తూము ద్వారా బయటికి వెళ్లేందుకు వీలుగా ఉన్న నాలా



నేడు అదే కాల్వపై మట్టి పోయడంతో కనిపించకుండా పోతున్న నాలా



నాడు ఇబ్రహీం చెరువు కింద ఉన్న తూము నుంచి బయటకు వచ్చిన నీటితో చెరువును తలపిస్తున్న ప్రాంతం



నేడు తూమును కబ్జా చేసి పోసిన మట్టి



నాడు చెరువులోని తూము నుంచి వచ్చే నీరు వెళ్లే నాలా



నేడు కాల్వపై మట్టిపోయడంతో కనిపించకుండా పోయిన నాలా

నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లో ఇబ్రహీం చెరువు తూము కూల్చివేతలు శరవేగంగా జరుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. తూముకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు పట్టాలు చేసుకుని యథేచ్ఛగా నాలాలను సైతం కబ్జా చేసి మట్టి పోసి మాయం చేస్తున్నారు. అధిక వర్షాలు కురిస్తే ఈ చెరువు నుండి తూము ద్వారా నీటిని బయటకు విడుదల చేస్తారు. తూముద్వారా వచ్చిన నీరంతా నివాస గృహాల మధ్యలో నిలిచి ఉండడంతో దుర్గంధం వెదజల్లడమే కాకుండా ఈగలు, దోమలకు ఆవాసంగా మారుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొందరు తూము నుంచి వచ్చే నీరు బయటకు వెళ్లేందుకు వీలు లేకుండా నాలాను కూడా కబ్జా చేశారు. దీంతో నీరు ఎటూ వెళ్లలేక ఇళ్లమధ్యలోనే ఉంటుండడంతో అధికారుల తీరుపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

చిత్రం గీసి.. అభిమానం చాటి



తలమడుగు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రాన్ని గీసి తన అభిమానాన్ని చాటాడు తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన గట్టు రాజు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆ మహానేతపై ఉన్న అభిమానంతో పెన్సిల్‌తో చిత్రాన్ని గీసినట్లు చిత్రకారుడు రాజు తెలిపాడు.

సౌదీలో దండేపల్లి వాసి మృతి

- ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్
- అవయవదానంతో నలుగురు విదేశీయులకు పునర్జన్మ



మృతుడు వెంకటేశ్(ఫైల్)



మరణ వార్త తెలియడంతో విషాదంలో కుటుంబ సభ్యులు

దండేపల్లి: ఉపాధి నిమిత్తం సౌదీ వెళ్లిన దండేపల్లి మండలం పాత మామిడిపల్లికి చెందిన పత్తిపాక వెంకటేశ్(41)ఫిట్స్‌తో అక్కడ మృతిచెందాడు. ఈమేరు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వెంకటేశ్ ఉపాధి నిమిత్తం గతేడాది జూన్ 21న సౌదీ వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న అతనికి ఈనెల 3న ఫిట్స్ రావడంతో తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కోమాలోకి వెళ్లినట్లు తెలిపారు. వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. ఆదివారం అర్ధరాత్రి బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. వెంకటేశ్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అతడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేశ్ మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను బంధువులు కలిసి కోరారు.

గొప్పమనసు చాటుకున్న బాధిత కుటుంబం..

ఇదిలా ఉండగా వెంకటేశ్ కుటుంబం పెట్టెడు దుఃఖంలోనూ గొప్ప మనసు చాటుకుంది. దుబయ్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందడంతో అక్కడి ఆస్పత్రిలోని అవయవదాన ట్రస్టు సభ్యులు, వైద్యులు వెంకటేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అవయవదానం చేస్తే నలుగురికి కొత్త జీవితం ప్రసాదించినట్లు అవుతుందని తెలిపారు. వారి విజ్ఞప్తి మేరకు వెంకటేశ్ కళ్లు, కిడ్నీలు దానం చేసేందుకు వెంకటేశ్ భార్య సరిత అనుమతి ఇచ్చింది. మరణించిన వెంకటేశ్ మరో అవయవదానం తో మరో నలుగురికి పునర్జన్మ ప్రసాదించాడు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

తలమడుగు: సెల్‌ఫోన్ ఇప్పుడెందుకని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం.. మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన మేస్రం కృష్ణ (18) నెల రోజులుగా తమ తల్లిదండ్రులను సెల్‌ఫోన్ కొనివ్వమని అడిగాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇప్పుడు నీకెందుకు ఫోన్ అని మందలించడంతో ఈనెల 3న ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెదికినా ఆచూకీ లభించలేదు. గ్రామ సమీపంలోని కొండపైన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్లు సోమవారం ఉదయం గ్రామస్తులు గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తల, శరీరం సగభాగం కుళ్లిపోగా.. పోలీసులు, వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సురేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



హరీశ్(ఫైల్)

కడెం: గత నెల పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామానికి చెందిన బత్తుల హరీశ్ (24) చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బత్తుల లక్ష్మి–రాజన్న దంపతుల రెండవ కుమారుడు హరీశ్ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి కొంతకాలంక్రితం స్వగ్రామానికి వచ్చాడు. గత నెల పురుగుల మందుతాగడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై పోలీసులకు సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గంజాయి కేసులో అరెస్టు

బెల్లంపల్లి: నిషేధిత గంజాయిని అక్రమంగా అమ్మకం, కొనుగోలు చేసిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. ఈ నెల 4వ తేదీన చేపట్టిన వాహనాల తనిఖీలో మందమర్రికి చెందిన రవితేజ అనే యువకుడు పట్టుబడగా అతడి వద్ద నుంచి 2కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ కేసులో భాగస్వామి అయిన మందమర్రికి చెందిన మరో నిందితుడు మక్కల గంగాధర్‌ను అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. తమకు మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన విశ్వదేవ్ మిస్త్రీ అనే వ్యక్తి గంజాయిని అమ్మాడని చెప్పడంతో చంద్రపూర్‌కు వెళ్లి నిందితుడు విశ్వదేవ్ మిస్త్రీని అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇద్దరు నిందితుల వద్ద నుంచి 50 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టుకు పంపామని వెల్లడించారు. సమావేశంలో టూటౌన్ ఎస్సై డి.రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదిపై దాడి..?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

బెల్లంపల్లి: భర్త ఉండి తప్పుడు సమాచారంతో ఒంటరి మహిళ ఫించన్ పొందుతూ ప్రభుత్వాన్ని మోసగిస్తోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు తనపై ఓ మహిళ దాడి చేసిందని బెల్లంపల్లికి చెందిన ఓ మహిళ న్యాయవాది వీడియో విడుదల చేసింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిప్పరి విక్టోరియా అనే మహిళ బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీలో భర్త కరుణాకర్, పిల్లలతో నివాసం ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఒంటరి మహిళ ఫించన్ తీసుకుంటుంది. ఈ మేరకు న్యాయవాది గాదవేణ మమత ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ విషయంపై మాట్లాడుకుందామని రడగంబాల బస్తీలో ఉన్న హనుమాన్ ఆలయం వద్దకు రావాలని మమతకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు వెళ్లిన తనపై మెప్మా ఆర్పీల సమక్షంతో విక్టోరియా, ఆమె కూతురు నందిని దాడి చేశారని, విక్టోరియా భర్త కరుణాకర్ తీవ్రంగా దూషించాడని మమత వీడియోలో ఆరోపించారు. తాను గర్భిణి అని కూడా చూడకుండా భౌతికంగా దాడి చేశారని కన్నీరు పెట్టుకుంది. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్ అండతో తనపై దాడిచేశారని తెలిపింది. ఈ ఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొంది. ఇదిలా ఉంటే.. ఓ పొదుపు సంఘంలో నిధుల దుర్వినియోగం జరగడంతో మమత తల్లి, ఆడబిడ్డపై ఏడాదిక్రితం చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ విషయంలో కాంప్రమైజ్ కావాలని విక్టోరియాపై న్యాయవాది మమత ఒత్తిడి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుకునే క్రమంలో మాటామట పెరిగి వీడియో తీస్తున్న బాలికపై మమత చేయిచేసుకుందని చెప్పారు. దీతో విక్టోరియా, మమత పరస్పరం కొట్టుకున్నారని తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

యూఎస్‌ఏ సమ్మిట్‌కు నిర్మల్ విద్యార్థిని



గ్రీన్ స్కిల్స్ అకాడమీ, టాస్క్ బృందం సభ్యులతో మనాల్ మునీర్(బురఖా ధరించిన యువతి)

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థిని 'మనాల్ మునీర్' అరుదైన ఘనతను సాధించింది. గ్రీన్ స్కిల్స్ అకాడమీ, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'పర్యావరణం–సుస్థిరాభివృద్ధి' ప్రాజెక్టులో విజేతగా నిలిచి యూఎస్ఏలో నిర్వహించనున్న వన్ఎంవన్‌బి సమ్మిట్‌కు ఎంపికైంది. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల టీ–హబ్ కేంద్రంలో టాప్ 17 పోటీదారులకు చివరి ఆడిషన్‌ను సోమవారం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టులో దాదాపు 7వేల మంది విద్యార్థులు పాల్గొనగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని దీక్ష డిగ్రీ కళాశాలలో బీఎస్సీ బీజెడ్‌సీ ఫైనలియర్ చదువుతున్న మనాల్ మునీర్ టాప్ ఐదుగురిలో చోటు సంపాదించింది. ఈనెల చివరి వారంలో అమెరికాలో నిర్వహించే యునైటెడ్ నేషన్ సమ్మిట్‌నందు ఈమె పాలుపంచుకోనున్నారు. మానవగ్రహం అన్వేషణ, ప్రకృతి పరిరక్షణ, సాంకేతికత వినియోగం వంటి చర్యలను చేపట్టే విధానాలను ఇందులో అధ్యయనం చేయనున్నారు. మానవ మనుగడ, ప్రకృతి పరిరక్షణ, గ్రీన్ కారిడార్ నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే అంశాల పట్ల ఇందులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అమెరికాలో నిర్వహించే సమ్మిట్ కు తమ సంస్థ విద్యార్థిని హాజరుకానుండడంపట్ల దీక్ష విద్యాసంస్థల డైరెక్టర్ వెంకట్ రెడ్డి, ప్రమోదరావు, ప్రిన్సిపల్ మెంగ శ్రీధర్, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆలస్యంగా గుర్తించిన కుటుంబీకులు



సాయికుమార్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని దర్బన జిన్నింగ్ సమీపంలో గల జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ప్రమాదంలో మృతుడి తల నుజ్జునుజ్జు కాగా గుర్తుపట్టలేక ఉండడంతో మృతదేహాన్ని బోథ్ మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహం వడూర్ గ్రామానికి చెందిన కత్తులపురం సాయికుమార్ (23)గా కుటుంబ సభ్యులు సోమవారం గుర్తించారు. సాయి రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లా నర్సాపూర్ మండలం చాక్‌పల్లి గ్రామానికి చెందిన వారి బంధువుల ఇంటికి వెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు. అయితే ఆదివారం తిరిగి వస్తానని చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. అదే రాత్రి ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఐటీడీఏ పీవోను కలిసిన కార్మికులు



పీవోను సన్మానిస్తున్న కార్మికులు

ఖానాపూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు శానిటేషన్ కార్మికులు సోమవారం ఐటీడీఏ పీవో కుష్బూగుప్తాను ఉట్నూర్‌లో కలిశారు. కార్మికుల నెలసరి వేతనం రూ. 2 వేలు అదనంగా పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పీవోను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేబీసీ నారాయణ, నాయకులు హుస్సేన్, రాజేందర్, రమేశ్, రాంచందర్, మల్లేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని కప్పర్లకు చెందిన కేమ నందుపై సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు అధికారి, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కప్పర్లకు చెందిన కొల్లూరి చిన్న గంగన్న కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 6న రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా కేమ నందు అకారణంగా కులం పేరుతో దూషించాడు. ఆయనపై దాడి చేయగా కింద పడిపోయాడు. అలాగే గ్రామంలోని మంద ఏరియా వద్ద ఏర్పాటు చేసిన ఐదు సిమెంట్ బల్లలను ధ్వంసం చేశాడు. వాటిపై కూర్చున్న ప్రభాకర్‌పై కూడా దాడికి పాల్పడ్డాడు. సీసీ కెమెరాలు సైతం ధ్వంసం చేశాడు. బాధితుడు తాంసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, డీఎస్పీ సోమవారం గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇది వరకు ఆయనపై ఐదు పాత కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో నందుపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఉపాధ్యాయులు లేక మూతబడిన పాఠశాల



తాళం వేసి ఉన్న రాజురా పాఠశాల

కుభీర్: మండలంలోని రాజురా ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఉపాధ్యాయులు రాక తాళం తీయకపోవడంతో విద్యార్థులు కొద్దిసేపు బయట కూర్చోని ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఉన్న ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా సీఆర్‌టీ మాత్రమే అప్పుడప్పుడు పాఠశాలకు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై కాంప్లెక్స్ హెచ్ఎం సాయన్నను వివరణ కోరగా సీఆర్‌టీని బడికి పంపించామన్నారు. సీఆర్‌టీ ఆనంద్‌ను అడగగా తాను కుభీర్ హరిజనవాడ పాఠశాలకు వెళ్లానని చెప్పారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



లేగదూడ కళేబరాన్ని మట్టిలో పూడుస్తున్న కుటుంబ సభ్యులు

బజార్‌హత్నూర్: మండలంలోని గిరిజాయి గ్రామ పంచాయతీ పరిధి ఉమార్డ బీట్ అటవీ ప్రాంతంలో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎఫ్‌బీవో వివేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గత శనివారం బద్దునాయక్‌తండా గ్రామానికి చెందిన జాదవ్ పూల్‌సింగ్ తన పశువులను మేత కోసం ఉమర్డ అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తీసుకవచ్చే క్రమంలో లేగదూడ తప్పిపోయింది. రెండు రోజులుగా గాలించగా అటవీ ప్రాంతంలో లేగదూడ కళేబరం లభ్యమైంది. అటవీ అధికారులకు అందిన సమాచారం మేరకు అక్కడికి చేరుకొని అడుగుల ఆధారంగా చిరుతగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. రైతుకు పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. పశువులను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లకూడదని రైతులకు సూచించారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఇద్దరి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు

మంచిర్యాలక్రైం: వరకట్నం వేధింపుల కేసుల్లో కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరిని నాన్ బెయిలబుల్ వారెంట్(ఎన్‌బీడబ్ల్యూ)పై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కె.నరేశ్ కుమార్ సోమవారం తెలిపారు. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన గుడి మోజేష్‌తో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన పల్లె రామస్వామి–నాగమ్మ దంపతుల కూతురు సరితతో 2005లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో సరిత తల్లిదండ్రులు రూ.3లక్షలు నగదు, 9 తులాల బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. కొంత కాలం వీరి దాంపత్య జీవితం బాగానే సాగింది. ఈ క్రమంలో కూతురు, కుమారుడు జన్మించారు. తర్వాత సరిత, మోజేష్ మధ్య గొడువలు మొదలయ్యాయి. మోజేష్‌తోపాటు అతని అన్న సాల్మాన్‌రాజ్, వదన ఏస్తేరు, తమ్ముళ్లు ఫిలిప్, కృపానందం సరితను అదనపు కట్నాం కోసం శారీరకంగా, మానసికంగా వేధించారు. బాధితురాలు 2019లో ఫిర్యాదు చేయగా మోజేష్, సాల్మాన్‌రాజు, ఏస్తేరు, ఫిలిప్, కృపానంద్‌పై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. నిందితులు కోర్టు విధించిన వాయిదాలకు హాజరు కాకపోవడంతో న్యాయమూర్తి కె.నిరోష నలుగురిపై ఎన్‌బీడబ్ల్యూ వారంట్ జారీ చేశారు. దీంతో మహిళా పోలీస్ స్టేషన్ ప్రత్యేక సిబ్బంది వి.రాజేశ్, ఎంఏ.నిసార్ అహ్మద్, జి.రామేశ్వర్‌రావు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం కృపానందం, ఫిలిప్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో లక్సెట్టిపేట జైలుకు తరలించారు. సాల్మాన్‌రాజ్, ఏస్తేరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.